సమ్మెపై తొలగని ప్రతిష్టంభన..

- అర్ధరాత్రి వరకూ జేపీఎస్ నాయకులతో సాగిన చర్చలు..
- జిల్లాలో 415కిపైగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు
- భవిష్యత్ కార్యచరణపై నేడు కీలక సమావేశం..
- జేపీఎస్‌ల సమ్మెబాట..?


కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు (ఫైల్)

సుభాష్‌నగర్/మోర్తాడ్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెపై ప్రతిష్టంభన తొలగలేదు. అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వంతో పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తాని యాతో గురువారం రాత్రి వరకూ చర్చలు కొన సాగాయి. చర్చలు సఫలం కాని పక్షంలో శుక్రవారం నుంచి సమ్మెకు వెళ్తామని ఇప్పటికే నోటీసులను ప్రభుత్వం, జిల్లాల కలెక్టర్లకు అందజేశారు. జేపీఎస్‌ల నోటిఫికేషన్, సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన మేరకు రెగ్యులరైజ్ చేస్తూ జీవో విడుదల చేయాలని, నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం ముందుంచారు. జిల్లాలోని 530 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 415 మందికిపైగా జూనియర్ పంచాయతీ, ఔట్‌సోర్సింగ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ఏప్రిల్ 12, 2019లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరారు. నోటిఫికేషన్ ప్రకారం ప్రొబేషన్ పీరియడ్ ఏప్రిల్ 11, 2022 నాటికే పూర్తయ్యింది. కానీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రొబేషన్ కాలాన్ని మరో ఏడాది పొడగించారు. పొడిగించిన ఏడాది కూడా ఏప్రిల్ 11, 2023 నాటికే ముగిసింది. ఈ విషయమై అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పలుమార్లు ప్రభుత్వం, మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎలాంటి సానుకూల నిర్ణయం రాకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 13న సమ్మె నోటీసు ప్రభుత్వానికి అందజేశారు. 15 రోజుల నోటీస్ కాలం తర్వాత ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయించారు.

డిమాండ్లలో కొన్ని..

- జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలి. గడిచిన నాలుగేళ్ల ప్రొబేషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలి
- ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పని చేసిన కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌లోభాగంగా పరిగణించాలి
- మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి.

చర్చలు విఫలమైతే జిల్లాలో అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరశివారులోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్లో సమావేశం ఏర్పాటు చేసుకోనున్నారు. సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో చేపట్టే ఆందోళనలు, నిరసనలపై కీలక అంశాలను చర్చించనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, అధికారిక వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల నుంచి జేపీఎస్‌లు లెఫ్ట్ అయ్యారు. కొందరు విధులకు కూడా హాజరుకావడం లేదు.

తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి. నిబంధనల ప్రకారం నాలుగేళ్ల ప్రొబేషన్ కాలం ముగిసింది.సీఎం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ జీవో విడుదల చేయాలి. లేకుంటే నిరవధిక సమ్మె చేస్తాం.

– భానుక చంద్రశేఖర్, జేపీఎస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

ఇబ్బందులు కలగకుండా చూస్తాం



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు వెళ్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతాం. రోజూవారీ కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా చూస్తాం. సమ్మె విషయాన్ని జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశానుసారం చర్యలు చేపడుతాం.

– డాక్టర్ జయసుధ, డీపీవో

క్లుప్తంగా

గడ్కోల్ జీపీ కార్యాలయం తనిఖీ



సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని గురువారం జెడ్పీ సీఈవో గోవింద్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మన ఊరు మన బడి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలని సీఈవోను సర్పంచ్ దేవాగౌడ్ కోరారు. ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, సర్పంచ్ దేవాగౌడ్, ఉపసర్పంచ్ రవిందర్, వార్డు సభ్యులు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘ సభ్యత్వ నమోదు



జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు మండల అధ్యక్షుడు శ్రీపతి శేఖర్ తెలిపారు. రూరల్ అధ్యక్షుడు లోలం జగదీశ్వర్, నాగభూషణం, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి




జక్రాన్‌పల్లి: రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న సమ్మెకు పోలీసులు సహకరించాలని వారు కోరారు. ఈమేరకు గురువారం వారు ఎస్సై శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం క్రమబద్ధీకరించకపోవడంతో శుక్రవారం నుంచి సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యదర్శులు అనిల్, శ్రీనివాస్, హరీష్, జయంత్ పాల్గొన్నారు

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



జక్రాన్‌పల్లి: మండలకేంద్రంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభ వాల్‌పోస్టర్లను గురువారం డీఎస్పీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఈనెల 30న నిర్వహించనున్న స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభకు డీఎస్పీ కార్యకర్తలు పెద్ద సంఖ్యల తరలిరావాలన్నారు. నాయకులు మహేష్ మహరాజ్, గంగసాయిలు, దిలీప్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తెలిపారు. గురువారం ఆయన కాలనీలో పర్యటించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ.. కాలనీలో డ్రైయినేజీలు, రోడ్లు వేయిస్తానని హామీనిచ్చారు. అంతకుముందు కాలనీవాసులు ఆయనను సన్మానించారు. అనంతరం కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కనీస వేతనాల పెంపు కోసం పోరాడాలి

ఖలీల్‌వాడి: కనీస వేతనాల అమలు కోసం పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. నగరంలోని మున్సిపల్ కార్మికులతో వారు గురువారం మాట్లాడి, మేడే ప్రచార కరపత్రాలను పంచిపెట్టారు. నాయకులు కిరణ్, కర్క గణేష్, శివకుమార్, శాంతికుమార్, నరసయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ధర్పల్లి: మండలంలోని ఆయా గ్రామాల చెందిన బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ సారికరెడ్డి అందజేశారు. నాయకులు రాజ్ పాల్‌రెడ్డి తదితరులున్నారు.

అకౌంట్ సెక్షన్ అధికారిని సస్పెండ్ చేయాలి


అకౌంట్ సెక్షన్ ఆఫీసర్ భాస్కర్ టేబుల్‌పై కూర్చుని అందోళన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

తెయూ(డిచ్‌పల్లి): అక్రమమార్గంలో సూపరింటెండెంట్ నుంచి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పదోన్నతి పొందిన అకౌంట్ సెక్షన్ ఆఫీసర్ భాస్కర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు అకౌంట్ సెక్షన్ ఆఫీస్‌ను ముట్టడించారు. వర్సిటీకి సంబంధం లేని వ్యక్తులకు లక్షల రూపాయలు చెక్కులు ఎలా రాస్తారని, ఖజానా ఖాళీలో ప్రధానపాత్ర పోషించారని ఆరోపించారు. అకౌంట్ సెక్షన్‌లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మధులికను ఇతర విభాగానికి బదిలీ చేయాలని, ఆమెపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు సంతోష్, శివ, జయంతి, కవిత, అశ్విత్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఖలీల్‌వాడి: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా మద్దతు ధర ఇచ్చి, ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పెద్ది వెంకటరాములు, పల్లపు వెంకటేష్, నూర్జహాన్, గోవర్ధన్, గంగాధర్, శ్రీనివాస్, నన్నేసాబ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించండి


మైలారంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్పల్లి: పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని మైలారం, చల్లగరిగే, దుబ్బాక, డిచ్‌పల్లి మండలం సుద్దులంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయన గురువారం పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి రైతుల్ని ఆదుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు రైతులు బీమా సౌకర్యాలు పొందకుండా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతులకు పంట రుణాలను మాఫీ చేయాలని, దీర్ఘకాలిక రుణాలను రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందన్, అమృతాపూర్ గంగాధర్, కేశవేణు, శేఖర్‌గౌడ్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో వీవోఏల నిరసన



డిచ్‌పల్లి: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఐకేపీ వీవోఏలు గురువారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెలకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. **సిరికొండ:** మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద వీవోఏలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. వారు చేపట్టిన సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. నిరసనలో స్వామి, మూన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల శ్రీదేవీ శ్రీభూదేవీ సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, సత్యనారాయణస్వామి, గణపతి ఆలయాల 11వ వార్షికోత్సవ వేడుకల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఏలేటి పశుపతి శర్మ, ఉమామహేశ్వర శర్మ, అర్చకులు రాహుల్ తిరుపతి నేతృత్వంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షికోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

స్వర్ణామృత ప్రాశనం పంపిణీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలోగల ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో గురువారం చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన మందు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి మాట్లాడుతూ 0–15 వయస్సుగల పిల్లలకు దివ్యౌషధాన్ని 9ఏళ్లుగా ఉచితంగా అందజేస్తున్నామన్నారు. దాదాపు 3లక్షల మందికి పంపిణీ చేశామన్నారు. ప్రతి మాసంలో వచ్చే పుష్యమి నక్షత్రం రోజు నెలకొకసారి మాత్రమే ఉదయం 7 నుంచి 12.30 గంటల వరకు ఇస్తామన్నారు. ఆలయ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈనెల 17నుంచి తరగతులు ప్రారంభం కాగా.. బాలబాలికలకు ఆయా రంగాలకు చెందిన ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. గురువారం మెజీషియన్ రంగనాథ్ చేసిన మ్యాజిక్ షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అలాగే బాలికలకు భరతనాట్యంలో శిక్షణ ఇస్తున్నారు.

సంక్షిప్తం

డార్విన్ సిద్ధాంతం తొలగింపు సరికాదు

నిజామాబాద్‌అర్బన్: సీబీఎస్ఈ పదో తరగతి పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇటీవల 10, 11, 12 తరగతుల పుస్తకాల నుంచి కొన్ని భాగాలను గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం, డార్విన్ పరిణామ సిద్ధాంతం తొలగించడం బాగులేదన్నారు.

కబ్జాకు గురైన పార్క్ స్థలం పరిశీలన

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరంలోని న్యూ ఎన్జీవోఎస్ కాలనీలో రిటైర్డ్ టీపీవో పార్క్ స్థలాన్ని కబ్జా చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం టీపీవో కరుణాకర్, టీపీఎస్ అనుప ఆధ్వర్యంలో స్థలాన్ని ప్రత్యేకంగా పరిశీలన చేపట్టారు. పార్క్ స్థలం ఎంతవరకు కబ్జా అయిందో దాని చుట్టుపక్కల వారిని అడుగుతు వివరాలు సేకరించారు.

బీఆర్‌ఎస్ ప్రతినిధుల సమావేశంలో జిల్లా నేతలు





సుభాష్‌నగర్/నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ప్రతినిధుల సమావేశానికి నిజామాబాద్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వ ర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, ఎంపీ సంతోష్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జిల్లా ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేష్‌గుప్త, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ ఉన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

నిజామాబాద్ సిటీ: నగరంలోని రామకృష్ణా విద్యానికేతన్ పాఠశాలలో గురువారం వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం అయ్యాయి. శిక్షకుడు ఎస్‌ఎన్ చారి రామకృష్ణుడికి పూజలు చేసి జ్యోతి ప్రజ్వలనతో తరగతులను ప్రారంభించారు. కరస్పాండెంట్ శ్రీనివాసచార్య, హెచ్ఎం శిరేఖ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాల శ్రీనివాసమూర్తికి ఘన నివాళి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ తెలుగు ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తికి తెలంగాణ సామాజిక రచయితల సంఘం జిల్లా ప్రతినిధులు ఘన నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు యెనుగందుల శంకర్ గురువారం మాట్లాడుతూ.. బాల శ్రీనివాసమూర్తి మరణం సాహితీ లోకానికి తీరనిలోటన్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

- గాయత్రీనగర్‌లో కంకర వేసి, నిలిచిన పనులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు


గాయత్రీ నగర్‌లో అధ్వానంగా మారిన రోడ్డు

ఖలీల్‌వాడి: నగరంలోని గాయత్రీనగర్‌లో రోడ్డు నిర్మాణంలో భాగంగా అధికారులు కొన్ని నెలల క్రితం కంకర వేశారు. కానీ సీసీ పనులు చేయడం మరిచారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

రెండు నెలలైనా సాగని పనులు..

గాయత్రీనగర్ నుంచి సిద్ధివినాయక్‌నగర్ గుడి వరకు రెండు నెలల క్రితం కంకర రోడ్డును కాంట్రాక్టర్ వేశారు. కంకర పనులు చేసిన సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్డు పనులను ఇప్పటికీ మొదలు పెట్టలేదు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాదారులు వాహనాలపై వెళ్లే సమయంలో టైర్లు పంక్చర్ అవుతున్నాయని, వాహనాలు స్లిప్ కావడంతో పడిపోతున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. వాహనాలు రాకపోకలతో కంకర పైకిలేచి పాదచారులకు నడవడానికి ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను త్వరగా పూర్తిచేయించి, రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి..



గాయత్రీనగర్ నుంచి సిద్ధి వినాయక గుడి వరకు కంకర రోడ్డు వేశారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలి. అసంపూర్తి పనులతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పనులు పూర్తి చేసేలా చూడాలి. –దేవేందర్, గాయత్రీనగర్

అటెన్షన్ ప్లీజ్..

డ్రెయినేజీ నిర్మించండి



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో డ్రైయినేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగు కాలువల్లో పారకం నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: సుమతి, పంచాయతీ కార్యదర్శి, హుస్సేన్‌నగర్

ఫోన్ నంబర్ : 9705495430

అన్నదాతలను ఆదుకోవాలి


కొండాపూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సిరికొండ: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోత్నూర్, పెద్దవాల్గోట్, కొండాపూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పొలాలను, తడిచిన ధాన్యాన్ని వారు గురువారం పరిశీలించారు. నష్టపోయిన రైతులతో వారు మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరికి ఎకరాకు రూ.యాభై వేలు, నువ్వులకు ఎకరాకు లక్ష రూపాయల పరిహారం మంజూరు చేయాలని కోరారు. రైతులు అకాల వర్షాలతో అల్లాడుతుంటే, బీఆర్ఎస్ నాయకులు ప్లీనరీ ల పేరిట డ్యాన్సులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ర వి, ఎర్రన్న, చందర్, సురేష్‌రెడ్డి, సామేల్, రమేష్, గంగారెడ్డి,సంతోష్, ఆసిఫ్, లింబాద్రి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఖలీల్‌వాడి: నగరంలోని సీతారాంనగర్ కాలనీకి చెందిన పలువురు యువకులు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి నాయకత్వం బలపరచడానికి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తదితరులు ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,250	వెండి (కిలో)	75,000
22 క్యారెట్స్	57,396	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	క్యాప్సికం	35	50
బెండకాయ	20	40	గాజరుగడ్డ	15	30
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బీర్నీసుకాయ	40	60	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	15	30	గోబిపువ్వు	20	40
పాలకూర	15	30	బీట్‌రూట్	20	40
మెంతికూర	30	50	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	30	50			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏపియన్)

స్క్రీన్–1– ఏజెంట్ – 10.15,4.25
పొన్నియిన్ సెల్వన్ భాగం–2–1.15,7.25,10.35
స్క్రీన్–2– రా రా పెనిమిటీ–11.00
విరూపాక్ష –1.25,7.30,10.25
కిస్ కా భాయ్– కిసి కీ జాన్(హిందీ)–4.25
స్క్రీన్–3 – పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –10.20,4.30 –ఏజెంట్ –1.30,7.40,10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –12.00, 3.30,7.00,10.30
స్క్రీన్–2– ఏజెంట్ –11.50,3.10,6.30,9.50
స్క్రీన్–3– ఏజెంట్– 10.30
ఈవిల్ డెడ్ రైజ్(ఇంగ్లీష్)–2.50,8.15
విరూపాక్ష –5.10,10.35
స్క్రీన్–4– పొన్నియిన్ సెల్వన్ భాగం–2 –10.15
కిస్ కా భాయ్ – కిస్ కీ జాన్ –(హిందీ) –1.45.7.10

దేవి – పొన్నియిన్ సెల్వన్ భాగం–2
నటరాజ్ – కిసి కా భాయ్–కిసి కీ జాన్(హిందీ)
లలితామహల్ – ఏజెంట్
విజయ్ – విరూపాక్ష